


సుభద్ర

రాధ మెల్లగా లోపలకు అడుగు పెట్టింది. చేతులు కళ్ల కాన్చుకుని వాలు కుర్చీలో పడుకున్న మాధవ్ కళ్ళువిప్పాడు.

అతనిని చూపి కొంచెం ఆశ్చర్యంగా, 'అప్పుడే వచ్చేసారే మీరు ?' అంది.

'ముందరేం రాలేదు. మామూలు వేళకే వచ్చాను. నీకు టైంకూడా తెలియట్లేదు కాబోలు' అతని కంఠంలో అప్రసన్నత ద్యోతకమయింది.

'ఎక్కడ్నించిట రాక ? మురళి యింటి దగ్గర్నుండేనా ?'

'అవునండీ. పాపం గోపీ, పాప వదలి పెడ్తే ఒట్టు. వాళ్ళని మరపించి వచ్చే సరికి ఆలస్యమయి పోయింది కాబోలు.'

'ఎంతసేపూ వాళ్ల గొడవేకాని, యింటి దగ్గర ఒక మొగుడు ఉన్నాడూ, ఇంటికి అలిసిపోయి వస్తాడూ అన్న ఆలోచనే ఉండదేమో ?'

అతని కుర్చీప్రక్కనే స్టూలు మీద కూర్చుంటూ, ఆ మాటలకు నొచ్చుకుంది రాధ.

'ఛా అవేమి మాటలండీ. వాళ్ళు పాపం యింకా చిన్నపిల్లలు. జ్ఞానమైనా రాలేదు. జాలివేస్తుంది యెవ్వరికైనా, యింత చిన్న తనంలోనే తల్లిని పోగొట్టుకున్నారంటే. మురళిని చూస్తే అతనిమటుకు అతను యెప్పుడూ పిచ్చెక్కిపోయి నట్లుంటాడు'

'అయితే మటుకు, అస్తమానూ నువ్వక్కడికెడ్తే యేం బాగుంటుంది ?'

రాధ తెల్లబోతూ చూచింది. 'ఛీ ఛీ. మీరేనా యిలా అంటూంట ? ఎలా అనగలిగారు ? మురళి యెవరికి క్రొత్తవాడు ? అతడూ, హేమా ప్రేమించి పెండ్లిచేసుకుని విషయం యెవరికి తెలియదు ? పైగా మీరు ఆ అభాగ్యుడికి ఒకానొకప్పుడు ఆప్త మిత్రులేమోకదా' కొంచెం అసహ్యం వ్యక్తపరుస్తూ అంది.

అనవసరంగా మాటజారేనే అని బాధ పడ్డాడు మాధవ్. పొరబాటున జారిపోయింది. ఇంక వెనక్కు తీసుకునేందుకు వీలులేదు. సర్దుకొనేందుకు ప్రయత్నించ పోగాడు.

'అదికాదు రాధా...'

రాధ విదిలించేసింది. 'ఏదికాదు ? మీలో యిలా భావం ఉదయిస్తుందనికూడా నే సను కోలే దసలు. ఎంత స్వార్థపరులు ? ఎన్ని కబుర్లు చెప్తారు ? మీకు మొదట్నించీ మురళికీ, నాకూఉన్న సన్నిహితం తెలుసును. అయినాకూడా యిలా అన్నారంటే...'

'సరే, ఏదో ఒకమాట జారితే, దాన్ని గంటల తరబడీ పీకడం తెలుసు. వచ్చేసరికి యింట్లో యెలానూ లేవు. వచ్చిన తర్వాతైనా కాస్త కాఫీచుక్క పోసే దిక్కైనా లేదు' విసుక్కుంటూ లేచాడు.

'బాగానే తిప్పేసారు. కాఫీ తీసుకొస్తానుండండి' లేచివెళ్ళింది రాధ.

తనన్నమాటకు నిజంగానే బాధపడ్డాడు మాధవ్. తను నిజంగా స్వార్థపరుడే. మాధవ్, రాధ, హేమ, మురళీ కాలేజీలో క్లాసుమేట్సు. హేమకు తల్లీ, తండ్రీ యెవ్వరూ లేరు. రాధ వాళ్ళింట్లో ఉండి చదువుకునేది. మురళి వాళ్ళకు చిన్నప్పట్నించీ సహవిద్యార్థి. బియ్యే చదువుతుండగా మురళి స్నేహితుడుగా తను పరిచయం చేయబడ్డాడు వాళ్ళకు. మురళికిచ్చే చనువు తన కివ్వట్లేదేనని, ఒక్కోసారి బాధపడేవాడు కూడా.

అప్పట్లో హేమా మురళీ ప్రేమించుకున్నారనే విషయం కూడా తెలియదు తనకు, మురళి యింట్లో యెదిరించి, హేమను పెళ్ళి చేసుకునేదాకా.

పెద్దల ఆశీర్వచనాలూ, అనుమతీ లేకుండా చేసుకున్నందుకు యిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ ఉండేవారు. ఒక్కయేడాది తిరిగేసరికి గోపీ పుట్టాడు. ఎమ్. ఏ. పాసయి తిరిగివచ్చిన మాధవ్‌కి పెద్దలే రాధతో వివాహం నిశ్చయం చేసారు. ఇద్దరూ ఒప్పుకొన్నారు. హేమా, మురళీల ఆనందం చెప్ప నలవికాదు. గోపీకో చిన్న చెల్లాయో, తమ్ముడో, పుట్టబోతున్నట్లు తెలిసింది.

'ఇంక ఆనకట్ట వేస్తే బాగుంటుందేమో?' అని తను సూచిస్తే, మురళి నవ్వేసాడు.

'ఏమో, మా బాధ్యత అయిపోయింది. ఇంక రాధది వంతు. మా అబ్బాయికో చిన్న అమ్మాయినీ...' రాధ గట్టిగా గిల్లేసరికి ఆపేసింది హేమ.

రాధ సిగ్గుతో ముఖం యెర్రగా చేసుకుంటూంటే ముగ్ధుడై చూసాడు తను. కానీ అంత ఆనందంగా సాగిపోయే సంసారంలో యిలాంటి చిక్కులొస్తాయని యెవరనుకున్నారు ?

నాలుగేళ్ళ గోపీని, రెండేళ్ళ పాపనీ, అప్పగించి, నిస్సహాయంగా మురళిని వదిలేసి, చూపులోనే తననూ, రాధనూ ప్రార్థించి శాశ్వతంగా కళ్ళుమూసింది హేమ.

అప్పట్నించీ మురళీ మనుష్యులలో పడటానికి చాలా కాలం పట్టింది. అప్పుడు వచ్చారు, మురళీ తల్లిదండ్రులు పీడ వదిలిపోయినందుకు మనసులో సంతోషిస్తూ, ఇప్పటికైనా తమ మాట విని, తాము నిశ్చయించే రెండవపెళ్ళి చేసుకోమని. ఆసహ్యంతో వాళ్ళముఖం కూడా చూడలేదు మురళి. తననూ, రాధనూ కూడా చెప్పి చూడమని వెళ్ళిపోయారు వాళ్ళు యేం చేయలేక. నిర్లిప్తంగా బ్రతుకుతున్న మురళిదగ్గరకు వెళ్ళి సాహసించి ఒకసారి చెప్పాడు పిల్లల కోసమైనా యింకో పెండ్లి చేసుకోమని.

సూటిగా చూసాడు తనవైపు. 'మధూ! ఇంతేనట్రా మమ్మల్ని అర్థం చేసుకుంది? హేమ స్థానంలో యింకొకళ్ళని చూడలేనురా, అసలు ఊహించలేను కూడారా'

గొంతు గద్గదమైపోతోంటే, అక్కణ్ణించి వేగంగా వెళ్ళిపోయాడు.

ప్రక్కనే ఉన్న రాధ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అంది, 'కొన్నాళ్ళదాకా ఆ ప్రస్తావన లేకండి అతను సర్దుకున్న తర్వాత ఆలోచిద్దాం. అందాకా పిల్లల్ని మనం చూద్దాం.'

పిల్లలతో తమింటికి వచ్చేయమన్నారు. వినలేదు మురళి.

'నీకు కూడా యీ వూళ్ళోనే ఉద్యోగమయిందని, రాధ, నువ్వూ యిక్కడికి వచ్చేస్తారని యెంత పొంగిపోయింది హేమ? అప్పుడు స్వంత యిల్లే కదా అని నువ్వూ, రాధ రమ్మంటేనే రాలేదు హేమ. ఇప్పుడా మాట తోసివేయలేనురా' ఇదీ సమాధానం.

అప్పట్నించీ యింట్లో పిల్లలకూ. తనకూ ఒక మనిషిని పెట్టుకున్నా, రోజూ వెళ్ళివస్తుంటుంది రాధ. రాధను చూడగానే, 'ఆంటీ' అంటూ వచ్చేస్తా రిద్దరూ.

మాధవ్ నిట్టూర్చాడు. అన్నీ తెలుసు తనకు. అయినా యెంతకాల మిలా?

మొన్నటికి మొన్న.........

మాధవ్ లేచేటప్పటికి, రాధ దిగులుగా కిటికీలోంచి బయటకు చూస్తూ నుల్చుంది. వెనకాతలగా వెళ్ళి భుజాలమీద చేతు లేసాడు.

ఉలిక్కిపడి వెనక్కు తిరిగిన రాధ కళ్ళనిండా నీళ్ళు.

గాభరాగా చూచాడు మాధవ్. 'ఏమయింది రాధా?' ఆత్రంగా అడిగేడు.

'ఈవేళ హేమ పుట్టిన రోజండీ! నేనూ, అదీ, మురళీ కలిసి సరదాగా గడుపుకునేవాళ్ళం. ఫైనలియరులో మీరు కూడా వచ్చారు కదూ!'

మాధవ్ నిట్టూర్పు విడిచేడు.

'ఛా, అందుకోసం యేడుస్తారా?' లాలనగా అన్నాడు కళ్ళ నీళ్ళు తుడుస్తూ. రాధ చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది దుఃఖం దిగమింగుకుంటూ.

'మురళీ యెంత పిచ్చిగా అయిపోతాడోనని భయంగా ఉంది ఒక్కసారి వెళ్ళొద్దామండీ'

'ఇప్పుడేనా?'

'అవును'

ఒక క్షణం ఆగి అన్నాడు, 'మనమెళ్ళి యేంచేస్తాం రాధా? వాడి కింక తప్పదు'

'అందుకని? మనం ఉండి బాధపడుతూంటే చూస్తూ ఊర్కొందామా? మీరు అలా ఉండగలరేమో కాని, నా మనస్సుండ లేదు' కొంచెం కోపంగా అంది.

మాధవ్‌కు అనుసరించక తప్పదనిపించింది.

'నేను ముఖం కడుక్కొని వస్తా. ఈ లోపున కాఫీ రెడీ చేయి' అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

ఇద్దరూ అక్కడకు వెళ్ళేసరికి మురళి కుర్చీలో కూర్చుని దిగాలుపడి హేమ ఫోటో చూస్తున్నాడు. అతని చెంపలమీద, అతనికి తెలియకుండానే కన్నీళ్ళు ప్రవాహంలా వస్తున్నాయి. పిల్లలిద్దరూ బిక్కమొహాలు వేసి తండ్రికేసి చూస్తున్నారు. మురళిని చూడంగానే యిద్దరికీ బాధవేసింది. పిల్లలు పరుగెట్టుకొచ్చి రాధను చుట్టేసారు. రాధ వాళ్ళను దగ్గరకు తీసుకొని, 'పాలుతాగారా బాబూ' అనడిగింది.

'లేదు ఆంటీ! నాన్న యేడుస్తూంటే మాకూ యేడుపొస్తోంది' గోపీ అన్న మాటలకు బలవంతంగా నిగ్రహించుకుని వంటావిడని పిలిచింది.

'మీరు లోపలకువెళ్ళి పాలుతాగండి బాబూ! నాన్నని నేను చూస్తాను' అని పంపించేసింది.

మురళీ ప్రక్కకువచ్చి, 'మురళీ ? ఏమిటిది ? పిల్లలు, పసివెధవలు హడలిపోతున్నారు. ఇదేనా, నువ్వుచేసే నిర్వాకం?' అంది కేకలేస్తున్నట్లు.

ఆ మాటలేం వినిపించుకోనట్టు, రాధకేసి చూస్తూ, 'రాధా, ఇవేళ హేమ పుట్టిన

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి గోపాలాచార్యులవారి
జీవామృతం
69 సంవత్సరములనుండి
ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
మదరాసు 17

పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5-50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
SULEKHA TRADERS.
(WAT-7) Beat No. 13. Aligarh.

టెరిలిన్ వస్త్రములు

టెరిలిన్ ప్యాంటు మరియు షర్టు వస్త్రములు (1.25 & 2.25 మీ.) రెండున్ను క్లియరెన్సు ధర రు. 28 50 లకే అమ్మబడును. V.P.P. ఛార్జీలు రు.2.50 అదనం
ARVIND AGENCIES (APW-40).
P. O. Box 1408. Delhi-6.

వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టర్
రు. 265/- విలువగల ప్రపంచ ఖ్యాతి పొందిన "విండ్సర్ హిటచి" 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ను

నెలసరి వాయిదాలపై రు. 25/- వంతున చెల్లించి పొందండి. వివరములకు:
Swiss Television Co. (AP-55)
P. O. Box 1320, Delhi-6.


# స్వార్థపరుడు

రోజా అప్పుడు మనమంతా యెలా సందడి చేసేవాళ్లమో తెలుసుగా! క్రిందటిసారి కూడా బాబిగాడితోటీ, పాపతోటీ ఆనందంగా చేసుకున్నాం. అప్పుడేమందో తెలుసా? 'జీవితంలో యీ సంతోషం చాలు నాకు. ఇలాగే చచ్చిపోతే బాగుండునని పిస్తోంది' అంది. నిజంగానే మాటచెల్లించుకుంది రాధా, తనెప్పుడూ మాట చెల్లించుకునే మనిషే' చేతుల్లో ముఖాన్ని దాచుకున్నాడు మురళి. రాధ యేడుపు నాపుకుందుకు తీవ్రప్రయత్నం చేసింది మళ్లా అతనే తలెత్తాడు. 'క్రిందటిసారివచ్చిన ఫ్రెండ్స్ మెనీ హేపీరిటర్న్స్ అని విషెస్ యిచ్చారు. ఏవి అవి? అన్నీ ఉత్తమాటలు'

'ఏమిటి నీపిచ్చి మురళీ! ముందు నువ్వు లే అక్కడ్నించి'

'క్షమించు రాధా! ఇలా ఉండనీ కాసేపు'

'అలా వీల్లేదు. ఇప్పటిదాకా ఉన్నావుగా చాలు. ఈ కాఫీ తీసుకో' వంటావిడ తెచ్చిన కాఫీ కప్పు అందిస్తూ అంది.

ఆ కప్పుకేసి అదోలా చూస్తున్నాడు. మళ్లా పాతజ్ఞాపకాలు.

'మురళీ! నామీద ఒట్టే, లే!'

మధ్యలో రెండు మూడు మాటలు ఓదార్పుగా అన్నా, మాధవ్ జరుగుతున్నదంతా చూస్తూ నుల్చున్నాడు.

'అదేమిటి? బట్టలైనా మార్చుకోకుండా అలా ఉండిపోయారేమిటి?' రాధ మాటలతో ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చాడు.

రాధ కాఫీ కప్పుతో నిల్చుని ఉంది. జేబులోంచి ఒక ఉత్తరంతీసి ఆమెకిచ్చాడు. 'మర్చిపోయాను రాధా! మీ నాన్నగారు ఉత్తరం రాసారు.'

రాధ ఉత్తరం చదువుకుంటూంటే, కాఫీ త్రాగుతూ చూస్తూ కూర్చున్నాడు.

రాధ చదవడం పూర్తి చేసి మడిచింది. చిన్నగా నవ్వుతూ, 'ఏముంది? ఎప్పుడూ ఉన్నదే. ఇంటికి రమ్మంటారు' అంది.

'అవును రాధా! మొన్న దీపావళి పండుగకు కూడా వెళ్లలేదు. ఇంటికి వెళ్లి ఎనిమిది నెలల పైగానే అవుతోంది. వెళ్లకూడదూ?'

'బాగుంది. మీకు సెలవు దొరకదని, నేను ఒక్కదాన్ని వెళ్లడం యిష్టం లేక నేగా పండుగకు మానేసింది? అయినా, యిప్పు డీ పరిస్థితులలో వెళ్లడమేమిటి? ఊరికినే చూడ్డానికేగా.'

'ఈ పరిస్థితుల్లో అంటే?' భ్రుకుటి ముడిచాడు మాధవ్.

'కాదు రాధా, మరీ అంతలా రాస్తూంటే, వెళ్లకపోతే యేం బాగుంటుంది? మధ్యలో నా మీద నింద వేస్తారు పంపించలేదని. మీ అక్కగారు కూడా వస్తారుటగా, వెళ్లిరా, పది పదిహేను రోజులుండి వద్దువుగాని.'

'పది పదిహేను రోజులా?' నవ్వింది రాధ. 'మీరూ వస్తారా?'

'నీకు తెలియని దేముంది? నేను రావడానికి వీలుపడదు.'

'అలాంటప్పుడు నేనూ వెళ్లనక్కర్లేదు. ఏదో ఆయన అలా రాస్తుంటారు. అక్క చూడాలనుంటే, యిక్కడకే వస్తుంది.'

'అదేం బాగుంటుంది. నువ్వే వెళ్లు. ఈసారి కెలాగో సర్దుకుంటానులే. రేపు పదిగంటల పాసెంజరుకు వెళ్లు. నిన్ను బండి ఎక్కించి అలా ఆఫీసు కెడతా నేను.' అనేసి జవాబు కోసం చూడకుండా గదిలోకి వెళ్లిపోయాడు.

రాధ తెల్లబోయింది. బిబ్బవంతం కాబోలు. ఇది ఆజ్ఞా? ఏమయినా ఈ రోజు అతను వేరుగా వున్నాడు. పోనీ యిప్పుడు తను చెప్పిన మాట విని, పది రోజులు ఇంటికి వెళ్తే అతని మనస్సు శాంతిస్తుందేమో? కానీ పాపం, మురళీ, పిల్లలు? హఠాత్తుగా అతను తనను వెళ్లమని బలవంతం చేయడంలో అర్థం స్ఫురించినట్లయింది. ఛీ ఛీ అనుకుంది.

గబ గబా గదిలోకి వెళ్లి అతని ముఖంలోకి సూటిగా చూస్తూ—

'ఎంత స్వార్థం? నిజం చెప్పండి. నేనలా అస్తమానూ మురళి యింటికి వెళ్లడం మీకిష్టం లేకనేగా యిప్పుడింత హఠాత్తుగా వెళ్లమంటున్నారు? ఈ చుట్టు దార్లెందుకు?' గట్టిగానే అంది. మాధవ్ చూపు తప్పించుకున్నాడు.

'ఆ ఉత్తరం మీ నాన్నగారిచేత రాయించానంటావా?'

ఎందుకలా భుజాలు తడుముకుంటారు? మా నాన్నగారు ఎప్పుడూ అలాగే రాస్తారు. మీరు యెప్పుడూ వేళాకోళం కింద తీసేసే




నెలకు రు. 500 సంపాదించండి
అనేక డిజైనులలోను, అనేకరకా రములలోను గల మా ప్రఖ్యాత కాశ్మీర్ ఆర్ట్ డీలక్స్ పులిన్ శాల్వ(Toosho)లకు ఆర్డర్లు పొంది నెలకు రు. 500/– సంపాదించండి. ఒకటి రు. 21. శాంపిల్ ఒకటి రు. 16.

GEMS ARTS (WAP-22)
P. Box 1325, Delhi-6.





# స్వార్థపరుడు

వారు, యీసారి౦త బలవంతం పెడ్తున్నా రేమిటట- అని?' వ్యంగ్యంగా అంది.

'అవన్నీ నా కనవసరం. నువ్వెడతావో, లేదో నీ యిష్టం. చదువుకున్న దానివి, వ్యక్తి స్వాతంత్ర్యం కలదానివి. నేనెవరు నిన్ను బలవంత పెట్టడానికి?' మాధవ్ విసురుగా అన్నాడు.

రాధ కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉండి పోయింది.

'ఆడది ఆదినుంచి కూడా దురదృష్టవంతు రాలే. ఆధునికయుగంలో ఆడదాని చదువు యెందు కుపయోగించినా, ఉపయోగించక పోయినా, దేప్పడానికి బాగా పనికివస్తోంది. సరే లెండి, మీ మాటకు యెదురుచెప్పి, మీ పురుష హృదయం అభిమానాన్ని గాయపర్చట మెందుకు? రేపు ప్రొద్దున్నే వెళ్తాను. పది పదిహేను రోజులేం ఖర్మ, ఒక నెల్లాళ్ళు ఉండి మరీ వస్తాను.' రోషంతో జీరపోతున్న కంఠాన్నదుపులోకి తెచ్చుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

'ఒరేయ్ మధవా ... మాధవ్' పరధ్యాన్నంగా సైకిలు త్రొక్కుతున్న మాధవ్ తెప్పరిల్లి చూసాడు. ఎదురుగా మురళి కనబడటంతో సైకిలు ఆపి దిగాడు.

'ఏరా? అంత పరధ్యాన్నంగా వున్నావు?'

మాధవ్ బలవంతంగా నవ్వుతూ 'ఏదో ఆలోచిస్తున్నాను. నువ్వెక్కడికి? ఇంటికేనా?' అన్నాడు.

'లేదురా! రెండురోజుల్లో యిన్‌స్పెక్షన్ వుంది. ఇంటికి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుంది, పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఉంటారు. రేపు పాప పుట్టినరోజు రాబోతోంది. కుర్రాడిచేత యింటికి బట్టలు పంపిస్తున్నాను. రాధను కొంచెం చూసిపెట్టమని చెప్పు. నిన్న అసలు కనబడనే లేదుట, గోపీ చెప్పాడు వెధవ మొహం వేసుకుని. నేను వచ్చి కనుక్కుందామంటే వీలుపడలేదు, రాధకు ఒంట్లో బాగుందా?'

మొహం త్రిప్పుకున్నాడు మాధవ్. 'రాధ ఊర్లోలేదు. వాళ్ళమ్మ గారింటికి వెళ్ళింది' మురళి ఆశ్చర్యపోయాడు, 'అదేమిటి? చెప్పనైనా చెప్పలేదే? ఏదైనా హఠాత్తుపని ఉండి వెళ్ళిందా?'

'ఊరికినే చూడాలనిపించి వెళ్ళింది. ఇరవయి రోజులవరకూ రాకపోవచ్చు' ముభావంగా అని, 'ఇంక నేను వెళ్ళివస్తాను మరి' అని సైకిలు యెక్కాడు. మురళి తెల్లబోయి చూస్తూ నిలబడ్డాడు.

'ఏమిటి రాధ చెప్పకుండా యెందుకువెళ్ళిపోయింది? బహుశా యిక్కడుంటే, తనూ తన పిల్లల బాధ్యత యెక్కువయి పోయిందేమో? వెళ్ళుతున్నానని చెపితే తనేమైనా అడ్డం పెడతాడేమోనని భయంవేసిందేమో? ఈ మధ్య కొంచెం నీరసంగా కనపడుతోందని వంటావిడ చెప్తోందికూడా.

ఏమయినా...అలా హఠాత్తుగా వెళ్ళినా, చెప్పకుండా ఉండదే? అయినా మాధవ్ యేమిటి అలా ముభావంగా వెళ్ళిపోయాడు? ఒకవేళ వాడికికాని, రాధ అస్తమానం రావడం యిష్టంలేక పోయిందా? ఛ ఛ, వాడు అలాంటివాడు కాదు. తమ గురించి వాడికి తెలియాదు కనుకనా? వాడూ తన స్నేహితుడేగా. ఏమీ తోచలేదతనికి. రాత్రి పదిగంటలకు నీరసంగా యింటికివచ్చిన మురళి గోపీ, పాపలను ముద్దెట్టుకోబోతే పాపవళ్ళు వేడిగా తగిలింది. గుండె గుభేలుమంది. చప్పుడుకు తృళ్ళిపడి లేచిన వంటావిడ,

'వచ్చారా బాబూ! అన్నం వడ్డిస్తాను పదండి. పాప మధ్యాహ్నం నుంచీ ఒంటీ అంటూ ఒకటే ఏడుపు. ఒళ్ళెరగదు' చెప్పింది.

మురళికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'నా కిప్పుడేం వద్దండీ! పాపను డాక్టరు వద్దకు తీసుకెడుతా' అని ఎత్తుకొని చీకట్లోకి నడిచాడు గబగబా.

* * *

'ఏమిటంత అర్జెంటుగా రమ్మని ఉత్తరం వ్రాసారు?' కాళ్ళు కడుక్కొని చెంబు చేతికిస్తూ అన్నాడు మాధవ్.

రాధ బుగ్గలు సిగ్గుతో కందిపోయాయి. 'ఏమో, ఉత్తరంలో రాయలేదా?'

రాధ ముఖంలోని అరుణిమను వింతగా చూస్తూ, 'లేదే? ఏమిటేట?' అన్నాడు.

'అది తర్వాత చెప్తాను గాని, మురళీ, పిల్లలూ యెలాగున్నారు? పాప మరీ అలవాటయిపోయింది నా దగ్గర.'

మాధవ్ కొంచెంముడుచుకుని, 'బాగానే ఉన్నట్లున్నారు. రాగానే అడగలేదేం అని చూస్తున్నాను. మురళి మధ్యలో ఒకసారి

కనబడి, నిన్ను త్వరగా రమ్మనమని రాయమన్నాడు మొన్న' అన్నాడు.

'పాపం, మరీ ఒంటరయిపోతాడు. పిల్లలు బెంగ పెట్టుకుని వుంటారు. పోనీ మీలాంటి స్నేహితులు దగ్గరగా ఉన్నా లాభం లేదాయె.'

మాధవ్ మాటల్లో వ్యంగ్యం పట్టించుకోనట్లుంది.

'అవును. నాలాంటి స్నేహితులవసరమేముంది ? చక్కగా స్నేహితురాళ్ళున్నారుగా.'

'మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు.'

ముఖం యెర్రగా చేసుకుంటూ, తనతో దెబ్బలాట వేసుకుంటుం దనుకున్న రాధ చిన్నగా నవ్వుతూ ఊర్కోవడం చూసి మరీ ఆశ్చర్యపోయాడు మాధవ్. ఏమయినా రాధ ఈ కొన్ని రోజులకే ఎంతో మారిపోయింది. మాటలే కాకుండా మనిషికూడా క్రొత్తగా కనబడుతోంది, అనుకున్నాడు.

'ఏమిటి అక్కడే అలా నుల్చుండి పోయారు ? లోపలకు పదండి.' అతని చూపులు తప్పించుకుంటూ అంది.

* * *

వెనక్కు వరుగెత్తే ప్రకృతిని తిలకిస్తూ కూర్చున్నాడు మాధవ్ రైలులో. అతని మనస్సు ఉత్సాహంతో నిండిపోయింది.

ఇంకా మరదళ్ళూ, బావమరుదులూ చేస్తున్న వేళాకోళాలే ప్రతిధ్వనిస్తున్నాయి. తనకో క్రొత్త హోదా రాబోతోంది. తను త్వరలో తండ్రి కాబోతున్నాడు ఆ మాట తల్చుకుంటున్నకొద్దీ ఆనందం వస్తోంది. తన సంతోషం చూసి, రాధ చెల్లెల్లు ఒకటే యేడిపించాడు. 'బావగారూ ! ఇంకా ఆరునెలలాగా లుండోయ్. అప్పటికి కొంచెం ఆనందం దాచుకోండి' అంటూ,

నవ్వుకున్నాడు మాధవ్. రాధలో అప్పుడే తల్లిపోలికలు కన్పిస్తున్నాయి.

అహాపే రాధతో అంటే, 'మీరు తండ్రి లక్షణాలు నేర్చుకోవాలి. చిన్న పిల్లాడిలాగ అల్లరిచేస్తే లాభంలేదు' అంది

తల్లి...తండ్రి...క్రొత్తమాటలు తమకు ఇవ్వాళ్ళ కు.

హఠాత్తుగా మురళి, పిల్లలు జ్ఞాపక మొచ్చారు. మనస్సు కలుక్కుమంది.

'పరమేశ్వరా ! నా బిడ్డలకు తలి


# కాల్ గ్యాస్ వాడి
## మీ వంట సమస్యల్కి పరిష్కారముచేసుకోండి




ఒక కాల్టెక్స్ ఉత్పత్తి

వంట గదిలో కాల్గ్యాసును యేర్పాటు చెసుకొని వంట ఎంత హాయిగా సాగుతుందో తెలుసుకోండి. కాల్ గ్యాస్ను వాడడం ఎంతోసులువు...ఒక క్షణంలో వెలుగుతుంది... మీ వంట చేసే కాలాన్ని కొన్ని గంటల కాలము దాకా తగ్గింపుతూ తక్షణమే వేడినిస్తుంది దానితో ఖర్చు ఎంతో తక్కువ కూడా, కాల్గ్యాస్ పరిశుభ్రమైనది... మసికాదు... పొగరాదు పాత్రలను కడుగుకొనే బాధయుండవు.

కాల్గ్యాస్ నిరపాయకరమైనది...

కాల్గ్యాస్ ప్రత్యేకమైన సేఫ్టీహ్యాట్సు తోపాటువుంటే ఉక్కు సిలిండర్లతో భద్రముగా మీకు లభిస్తుంది అందువలన కారడము మరియు అపకతవక వాడటం వుండదు.

ఇంటికివచ్చియిచ్చు సర్వీసుకలదు

కిం రిప్రజెంట్ విశాఖపట్నం గ్యాస్ కంపెనీ
48-9 5 కోఆపరేటివ్ కాలనీ, ద్వారకా నగర్,
విశాఖపట్టణము-4 ఫోను 5510
కెన్నెమరా ఎవెన్యూ, మౌంట్ రోడ్, మద్రాసు 2 ఫోను

ఏజెంట్లుగల స్థలములు : మద్రాసు, కాకినాడ, విశాఖపట్టణము, విజయవాడ, ఏలూరు, గుంటూరు, పాలకొల్లు, రాజమండ్రి, నెల్లూరు, విజయనగరం, మచిలీపట్టణము, సేలం, కాళహస్తి, ఒంగోలు, వరంగల్, పాండిచేరి, కాంచీపురం, కర్నూలు, చిత్తూరు, తిరుపతి, బొబ్బిలి, పార్వతీపురం, రామచంద్రపురం, సోంపేట, నర్సరావుపేట

# స్వార్థపరుడు

లేకుండా చేయకు' అని ప్రార్థించుకున్నా డప్రయత్నంగా.

విచిత్రం. ఇంకా పుట్టని బిడ్డల తల్లి కోసం ప్రార్థిస్తున్నాడు తను. పాపం, అథం, శుభం తెలియని పసితనంలోనే తల్లిని కోల్పోయిన బిడ్డలను చూస్తుంటే, అసలే ప్రియమయినవ్యక్తి వియోగానికి బాధ పడుతున్న మురళి మనసు యెలాగుంటుంది? ఛీ ఛీ, తానెంత నిర్దయగా, స్వార్థపరుడుగా తయారయాడు?

రాధ తన్నస్తమానూ స్వార్థపరుడు అంటుంది కోపంవచ్చినా, సంతోషంవచ్చినా కూడా. అన్నట్లు రాధను యింకో పదిహేను రోజులదాకా పంపమన్నారు వాళ్ళు. బాగా నీరసంగా ఉంటోందట. వెళ్ళగానే మురళికి యీ వార్త చెప్పాలి. హేమ ఉంటేనా, యీ వార్తకు యెగిరి గంతేసును. రాధంటే హేమకు పంచప్రాణాలూ. మురళి ఒక్కోసారి తమాషాకి అనేవాడు, 'నాకంటే నీకు రాధ యెక్కువయిపోతోంది. మాధవ్ కూడా నీ అంతలా చూడడేమో?' అని. పాప అచ్చు హేమ పోలిక. అందుకే రాధకు అదంటే ప్రాణం.

పాపం, ఆ పిల్ల రాధకోసం వలవరిస్తోందట. రోజూ జ్వరంకూడా వస్తోందట. రాధకు కావాలనే యీ విషయం చెప్పలేదు తను. చెప్తే యీ శుభసమయంలో అదే చింతపెట్టుకుని కూర్చుంటుంది. లేకపోతే తనతోపాటు వచ్చేస్తానంటుంది.

ఊరికినే 'పాప నిన్ను అస్తమానూ తల్చుకుంటోంది' అని చెప్పాడంతే. అయినా ఆడవాళ్ళంతా యింతే. ఇట్టే పసిపాపలను దగ్గరకు చేర్చుకుంటారు. అసలు సహజంగానే వాళ్ళకు మాతృహృదయం ఉంటుందేమో. ఊరు వచ్చేదాకా యీ విషయాలే ఆలోచిస్తూ కూర్చున్నాడు. రైలు దిగి, రిక్షా యెక్కి, దారిలో మురళికి విషయం చెప్పాలని, వాళ్ళింటిమీదుగా పోనిమన్నాడు. వెళ్ళేసరికి తాళం వేసేసి ఉంది. విస్మెరపోయాడు.

'ఏమిటి యింత పొద్దున్నే వీడు ఆఫీసుకు పోయాడా? వాడు వెళ్ళినా పిల్లలేరి? కొంపతీసి, వాళ్ళ పెద్దవాళ్ళు వస్తేకోపం తగ్గించుకుని అక్కడకు వెళ్ళలేదుకదా!

ఉహూఁ. అది సంభవం. వాళ్ళకు యీ పిల్లలంటే యేమాత్రం యిష్టంలేదు. అది మురళికి కూడా తెలుసును. అలా ఎప్పుడూ చేయడు.

అయినా వాళ్ళ మనసు మారిందేమో? అలాగయితే యెంత బాగుండును?

రాధ కూడా యెంతో సంతోషిస్తుంది.

మరి రాధకు కూడా ఒక బుజ్జాయి తయారవుతున్నాడుగా.

ఇంకా అస్తమానూ యింకోళ్ళ పిల్లలను యెలా చూడగలదు? అంత ప్రేమ కూడా యెలా పంచివ్వగలదు?

ఇలా అనుకుంటగాంటే, రాధ యెదురుగా నిలబడి, కళ్ళు పెద్దవి చేస్తూ, 'ఏమి ఆలోచనలండీ మీవి? ఎంత స్వార్థపరులు?' అంటున్నట్లు తోచింది. మాధవ్‌కు కోపం రాలేదు. పెదవిపై చిన్న నవ్వు వెలిసింది. ఏమయినా మురళీగాడి ఆఫీసుకు వెళ్ళి అన్ని విషయాలూ కనుక్కోవాలి. వాడు ఉండే ఉంటాడు. ఆఫీసులో యిన్‌స్పెక్షను యింకా అయిపోయి ఉండదు.

ఇంటికి వచ్చి, తలుపు తీసేసరికి యెదురుగా ఒక కవరు పడిఉంది. త్వరగా తీసాడు.

అరే! ఇది మురళి రైటింగే, వెళ్ళిపోతూ రాసి ఉంటాడు అనుకుని టేబిలుమీద పడేసి, బ్యాగ్ గదిలో పెట్టి, స్నానం చేసివచ్చి, తీరిగ్గా కుర్చీలో కూర్చుని విప్పాడు.

మనసులో యేమూలో సంతోషం మెదుల్తోంది. ఈ విషయం తెలిస్తే, పట్టుబట్టి రాధను తెచ్చేసుకునేవాడు. ఆ పిల్లలను చూడ్డంలోనే రాధ నీరసపడింది.

అయినా యేం రాసాడో?

పిచ్చిపిచ్చిగా ఉన్న ఆ రాత చూస్తూ తటారుగా కూర్చున్నాడు.

'మాధవ్,

నీకు, రాధకు చెప్పకుండానే వెళ్ళిపోతున్నాను. ఏమీ అనుకోవద్దు. ఏం చెయ్యను మరి? విధి నా సహనాన్ని పరీక్షిస్తోంది కాబోలు. ఓపిక సన్నగిల్లిపోయింది.

ఇంతకూ...పాప రాధకోసం బెంగెట్టుకుంది. ఏమిటో యీ మమతలు — ఇదే సృష్టి విచిత్రమేమో! పాప యేనాడూ చచ్చిపోయిన వాళ్ళమ్మను ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకోలేదు. అవును మరి, అప్పటినుంచీ రాధ మరిపించింది. అందుకనే రాధను చూడకుండా ఒక్క క్షణం ఉండలేకపోయేది. ఇప్పుడు మరిపించడానికి యెవ్వరూ లేకపోయారు. దురదృష్టం వికటంగా నవ్వుతూ నుల్చుంటే యెవ్వరుమటుకు యేంచేస్తారు? రాధ వస్తే బ్రతకవచ్చునని డాక్టరు చెప్పాడు. ఆశతో నీ దగ్గరకు పరుగెట్టుకొచ్చా, టెలిగ్రాం యిప్పిద్దామని. వచ్చేసరికి నువ్వు రాధ దగ్గరకు వెళ్ళావని, సెలవు రెండురోజులే పెట్టావు, సాయంత్రానికి వచ్చేయవచ్చునని తెలిసింది. రాధను తీసుకురావడానికి వెళ్ళావేమో, వస్తారేమోనని సాయంత్రంవరకూ యెదురుచూసి, అప్పుడు బయల్దేరబోతూంటే, డాక్టరు ఆపాడు. ఆయన ముఖం చూడగానే తెలిసింది యింక ఆ అవసరంలేదని. అయిపోయిందిరా, హేమ నాకు చివరిసారిగా ప్రసాదించిన పాపను దక్కించుకోలేకపోయాను. మాధవ్, నాకు యీ లోకంమీద, హృదయంలేని కసాయిల వంటి దురాచారాల పెద్దలమీద, నీ మీద, రాధమీద, చివరికి నా మీద కూడా కసిగా ...చాలా కసిగా ఉంది. ఏదైనా చేద్దామనుకున్నా గోపీ అమాయకమైన కళ్ళు నా ఊహలను సడలించేస్తున్నాయి. ఇంక మిగిలిన వాణ్ణి తీసుకుని యెక్కడకు వెళ్తున్నానో?

గమ్యంలేని......మురళి.'

బొమ్మలా అయిపోయాడు మాధవ్. రేపు రాధ రాగానే మొట్టమొదటే వీళ్ళ గురించి అడుగుతుంది. ఏం చెప్పాలి? అన్నివైపులా రాధ నుల్చుని, అతని వంక అసహ్యంగా చూస్తూ, అరుస్తున్నట్లు తోచింది.

'మీరే చంపేశారు పాపని. మీరే మురళిని గెంటేశారు. మీరే, మీరే...... ఉత్త స్వార్థపరులు... స్వార్థపరులు.' ●